క్లుప్తంగా

11న పెంచలకోనలో పుష్పయాగం



పెంచలకోన క్షేత్రం

రాపూరు: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైనపెంచలకోనలో శ్రీపెనుశిల లక్ష్మీ నరసింహ స్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి అమ్మవార్లకు పుష్పయాగాన్ని 11వ తేదీ నిర్వహించనున్నట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. మాఘ పౌర్ణమి సందర్భంగా పుష్పయాగం నిర్వహిస్తామన్నారు. ఉదయం స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం, రాత్రికి వివిధ రకాల పుష్పాలతో స్వామి, అమ్మవార్లకు పుష్పయాగం, అనంతరం క్షేత్రోత్సవం నిర్వహిస్తారని తెలిపారు. 10వ తేదీ రాత్రి శ్రీవారి నిత్యకల్యాణ మండపంలో పుష్పయాగం విజయవంతమయ్యేందుకు అంకురార్పణ చేపట్టనున్నట్లు అధికారులు వివరించారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి



వైద్యులకు సూచనలిస్తున్న సబ్‌కలెక్టర్

కోట: రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా వైద్యులకు సూచించారు. కోట సీహెచ్‌సీని గురువారం సబ్‌కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీని పరిశీలించారు. హాస్పిటల్‌లో అందిస్తున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. హాస్పిటల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, డాక్టర్లు సమయపాలన పాటించాలని సూచించారు. తహసీల్దార్ జయజయరావు పాల్గొన్నారు.

మెప్మా బజార్ ప్రారంభం

నాయుడుపేట టౌన్: నాయుడుపేట గాంధీ మందిరం వద్ద డ్వాక్రా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెప్మా బజార్‌ను సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ ప్రారంభించారు. మెప్మా బజార్‌ను ప్రారంభించేందుకు విచ్చేసిన ఎమ్మెల్యే విజయశ్రీని మహిళలు శాలువాలతో సత్కరించి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం మెప్మా మహిళలు తయారు చేసిన వస్తువులను ఎమ్మెల్యే సందర్శించారు. మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, నాయకులు పసల గంగాప్రసాద్, గూడూరు సుధీర్‌రెడ్డి, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఈఓ తనిఖీ



మాట్లాడుతున్న డిప్యూటీ సీఈఓ మోహన్‌రావు

దొరవారిసత్రం: మండల పరిషత్ కార్యాలయాన్ని గురువారం జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ మోహన్‌రావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించి, పలు పాలనాంశాలపై అవగాహన కల్పించారు. ఆయన వెంట స్థానిక ఎంపీడీఓ గోవర్ధన్, ఏఓ రఘురామయ్య, సిబ్బంది ఉన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



దొంగల ముఠా చిత్రాలను చూపి మాట్లాడుతున్న ఎస్‌ఐ అజయ్‌కుమార్

దొరవారిసత్రం: మండలంలో మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన దొంగల ముఠా సంచరిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీన్ని దృష్టిలో పెట్టుకుని మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్‌ఐ అజయ్‌కుమార్ తెలియజేశారు. ఈ దొంగల ముఠా మూడు రోజుల కింద చంద్రగిరిలోని ఓ విల్లాలో దొంగతనానికి పాల్పడిందని తెలిపారు. ఈ క్రమంలోనే బుధవారం రాత్రి, గురువారం టోల్ ప్లాజా, రహదారి వెంబడే ఉన్న పలు దాబాల్లో, లాడ్జీల్లో, రైల్వే స్టేషన్‌ల్లో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. దీంతోపాటు దొంగల ముఠా చిత్రాలను చూపి టోల్‌ప్లాజా సిబ్బంది, దాబాల్లోని వారిని అప్రమత్తం చేసి ఏమైనాసమాచారం ఉంటే 112, 94407 96359 నంబర్‌కు తెలియజేయాల్సిందిగా ఎస్‌ఐ కోరారు.

బీసీ గురుకులం వార్షికోత్సవ వేడుకలు

కోట: స్థానిక బీసీ గురుకుల పాఠశాల, కళాశాలలో వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణాన్ని సర్వాంగసుందరంగా అలంకరించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలతో సందడి చేశారు. ఉప్పొంగే ఉత్సాహంతో విద్యార్థులు డ్యాన్స్‌లు వేసి జోష్ నింపారు. ఉపాధ్యాయులను సన్మానించుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ నారాయణరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాడి దళారుల పాలు

గ్రామాల్లో వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమ కూడా అనుసంధానంగా ఉంది. పశువుల పేడను రైతులు పొలాలకు ఎరువుగా వాడుతారు. అలాగే వరి గడ్డి పశువుల మేతకు ఉపయోగిస్తారు. అయితే ప్రస్తుతం పాడి రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పాడి పరిశ్రమ కుదేలవుతోంది. గతంలో ప్రభుత్వ డెయిరీలు రైతుల వద్ద నుంచి పాలు కొనుగోలు చేసేవారు. కాలం మారడంతో కార్పొరేట్ కంపెనీలు గ్రామాలకు రావడంతో ప్రభుత్వ డెయిరీల మనుగడ ప్రశ్నార్థకంగా మారిపోయింది. – చిట్టమూరు

- పాలు తక్కువ ధరకు కొని ఎక్కువ రేటుకు అమ్మేస్తున్న వైనం
- కరువైన ప్రభుత్వ పర్యవేక్షణ
- తీవ్రంగా నష్ట పోతున్న పాడి రైతులు



రైతుల నుంచి పాలు సేకరిస్తున్న పాల ఏజెంట్

ప్రభుత్వ డెయిరీ నిర్ణయించిన ధర ప్రకారమే ప్రైవేటు డెయిరీలు రైతులకు వెన్న శాతం ప్రకారం రేటు చెల్లించాల్సి ఉంటుంది. అయితే ప్రభుత్వ డెయిరీలను మనుగడ సాగనీయకుండా ఉండేందుకు ప్రైవేటు డెయిరీలు సిండికేట్‌గా ఏర్పడ్డాయి. కొద్ది రోజులు మాత్రం ఎక్కువ ధరను రైతులకు చెల్లించేవారు. దీంతో రైతులు ఎక్కువ ధరకు ఆశ పడి ప్రభుత్వం ఏర్పాటు చేసిన పాల సొసైటీలకు కాకుండా ప్రైవేటు డెయిరీలకు పాలు పోసేవారు. ఈ క్రమంలో ప్రస్తుత పాలకులు పాడి రైతులను ప్రభుత్వ డెయిరీలను పట్టించుచుకోకపోవడంతో వాటి మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. దీంతో ప్రైవేటు డెరీలు ధరలు తగ్గించి వెన్న శాతం తక్కువ, పాలల్లో ఎస్ఎన్ఎఫ్, సాలిడ్ నాట్ ఫ్యాట్(పాలల్లో ఘన పధార్థం కాని ద్రవపదార్థం) తక్కువ అని చూపి రేట్లు తగ్గించేశారు. దీంతో రైతులు చేసేది లేక తక్కువ ధరకే నష్టం భరిస్తూ వారికే పాలు పోయాల్సిన పరిస్థతి నెలకొంది.

పుట్టగొడుగుల్లా దళారులు

కొంత మంది పాలు కొనుగోలు చేసే దళారులు రైతుల వద్ద నుంచి తక్కువ ధరకు పాలు కొనుగోలు చేస్తున్నారు. కార్పొరేట్ కంపెనీలకు ఎక్కువ ధరకు పాలు సరఫరా చేసి రైతుల కష్టాన్ని దోచుకుంటున్నారు. ఆటోలో ఊరూరా తిరిగి రైతుల వద్ద నుంచి నేరుగా చిన్న క్యానుల్లో పాలు తీసుకు వెళ్తున్నారు. తమ ఇళ్ల వద్ద తమకు ఇష్టం వచ్చినట్లు పాల కొలతలు, వెన్న శాతం వేసి తక్కువ ధర రైతులకు వేస్తున్నారు. ఆ పాలను అన్నీ కలిపి ఒక్కో దళారీ రోజుకు 400 లీటర్ల నుంచి 500 లీటర్ల వరకు ప్రైవేట్ డెయిరీలకు సరఫరా చేసి ఎక్కువ ధర తీసుకుంటున్నారు. అయితే గ్రామ స్థాయిలో రైతులకు తక్కువ ధర చెల్లిస్తున్నారు. అలాగే ప్రైవేటు డెయిరీలు ఇచ్చే లీటర్ కమీషన్ తామే తీసుకుంటూ రైతులకు చెల్లించడం లేదు.

తగ్గిన పాల ధరలు

గత సంవత్సరం రైతుల వద్ద నుంచి కేజీ ఫ్యాట్ రూ.820కి డెయిరీలు కొనుగోలు చేసేవారు. ఈ సంవత్సరం కేజీ ఫ్యాట్ ధర కేవలం దళారులు రూ.750 మాత్రమే రైతులకు చెల్లిస్తున్నారు. ఈ ధర ప్రకారం సరాసరి లీటరు రూ.40 మాత్రమే రైతులకు చేరుతోంది. ఈ ధర ప్రకారం రైతులకు పశువుల మేత కూలి, దాణా ఇతర ఖర్చులు కూడా రాక నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం రాయితీపై దాణా, పాల దిగుబడికి పోషకాలు కలిగిన పచ్చి మేతను అందజేసేవారు. ప్రస్తుత ప్రభుత్వం పాడి రైతుల గురించి పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



రైతుల ఇళ్ల వద్ద నుంచి ఆటోలో పాలు తీసుకెళ్తున్న దళారులు

గూడూరు నియోజకవర్గంలో రోజు సుమారుగా సరఫరా అయ్యే పాలు లీటర్లలో

గూడూరు, రూరల్	5600
చిల్లకూరు	3800
కోట	4800
చిట్టమూరు	3900
వాకాడు	4700
మొత్తం	22,800

నియోజకవర్గంలోని గూడూరు మండలంలో 1690 ఆవులు, 17040 గేదెలు, చిల్లకూరు మండలంలో 4632 ఆవులు, 13064 గేదెలు, కోట మండలంలో 2380 ఆవులు, 10982 గేదెలు, వాకాడు మండలంలో 3040 ఆవులు, 9849 గేదెలు, చిట్టమూరు మండలంలో 8423 ఆవులు, 17808 గేదెలు ఉన్నాయి. మొత్తం 42 వేల మంది పాడి రైతులు ఉన్నారు.

ప్రభుత్వ డెయిరీలు కుదేలు

ప్రభుత్వ డెయిరీలు కల్తీ పాలను తీసుకోవు. అలాగే పాలు స్వచ్ఛంగా ఉండాలి. పాలు గేదే నుంచి పితికిన తర్వాత 3గంటల్లోపే డెయిరీలకు చేరాలి. అప్పుడే మార్కెట్‌లోకి సరఫరా అయిన పాల ప్యాకెట్‌లు చెడిపోకుండా ఉంటాయి. అయితే ప్రైవేటు డెయిరీలు ఈ నిబంధనలు పాటించడం లేదు. రైతుల వద్ద నుంచి నిర్ణీత సమయం అంటూ లేకుండా మధ్యాహ్నం వరకు పాలు సేకరిస్తాయి. అవి చెడిపోకుండా కొన్ని రకాల రసాయనాలు కలిపి మార్కెట్‌లో అమ్ముతారు. రైతులు ఉదయాన్నే పాలు తీయలేక పోవడంతో 10 గంటలకు వచ్చిన ప్రైవేట్ డెయిరీలకు పాలు పోస్తున్నారు. దీంతో ప్రభుత్వం నిర్వహిస్తున్న విజయ, శ్రీజ డెయిరీలకు పాలు ఎక్కువగా సరఫరా కాకపోవడంతో ఖర్చులు పెరిగిపోవడంతో మూత పడే స్థితికి చేరుకున్నాయి. ప్రభుత్వ అనుసంధానంతో నడుస్తున్న డెయిరీలకు ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ప్రైవేటు డెయిరీలు ఆడింది ఆటగా సాగుతోంది. నియోజకవర్గంలో చిట్టమూరు, గునపాడు గ్రామ సమీపంలో ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్న శ్రీజ డెయిరీలకు పాల సరఫరా పూర్తి స్థాయిలో రాకపోవడంతో మూత పడ్డాయి. నియోజకవర్గంలో 5 ప్రైవేటు డెయిరీలు ఉండగా వాటిలో చిల్లకూరు మండలం బూదనం గ్రామంలో ఉన్న ఓ పెద్ద ఎస్ఎంసీ డెయిరీ పాల సేకరణను నిలిపివేసింది.

దాణా ఖర్చులకు కూడా రావడం లేదు



ప్రస్తుత రేట్లను బట్టి చూస్తే పశువులకు వేసే దాణా ఖర్చులకు కూడా సరిపోవడం లేదు. 50 కేజీల దాణా బస్తా రూ.1500కి కొనుగోలు చేస్తున్నాం. చివరకి కష్టమే మిగులుతోంది. ప్రభుత్వ డెయిరీలు పాలు కొనుగోలు చేసేలా చూడాలి.
– తిరునామల్లి కుమార్, పాడి రైతు, ఆరూరు

గత ప్రభుత్వంలో రాయితీపై దాణా



గత ప్రభుత్వంలో రాయితీపై దాణా అందించేవారు. ప్రస్తుతం అది కూడా ఇవ్వడం లేదు. దీంతో పెట్టుబడి పెరిగిపోతోంది. పశు పోషణ కష్టతరంగా మారడంతో కబేళాలకు పంపాల్సిన పరిస్థితి నెలకొంది. పాడి రైతులను ఆదుకోవాలి.
– బి.వెంకటేశ్వర్లు, పాడిరైతు, చిట్టమూరు

రాయితీపై దాణా అందించడం లేదు



గతంలోలా పాడి రైతులకు రాయితీపై దాణా సరఫరా చేయడం లే దు. అలాగే పశువులకు రోగాలు వస్తే పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తున్నాం. పాలు విక్రయాల విషయంలో రైతులదే పూర్తి బాధ్యత. ఎవరికి ఇష్టం ఉన్నవారికి వారు పాలను సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు అందలేదు.
– సురేంద్ర, పశు వైద్యుడు, చిట్టమూరు

దేవదాయ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు



హెచ్చరిక బోర్డు ఏర్పాటు

నాయుడుపేట టౌన్: దేవదాయశాఖ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని దేవదాయశాఖ కార్యనిర్వహణాధికారి రవికృష్ణ పేర్కొన్నారు. నాయుడుపేట మండల పరిధిలోని విన్నమాల గ్రామంలో వెలసి ఉన్న శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయానికి సంబంధించిన భూముల్లో దేవదాయశాఖ అధికారులు హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఈఓ రవికృష్ణ మాట్లాడుతూ శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయానికి సంబంధించి విన్నమాల రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 238/1ఏలో 0.26 సెంట్ల భూమిని కాళహస్తి శ్రీనివాసులు అనే వ్యక్తి ఆక్రమించి ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతో అడ్డుకున్నామన్నారు. దేవదాయశాఖకు సంబంధించిన భూమి అక్రమించిన శ్రీనివాసులుపై పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు.

పశువుల కొట్టంగా అంగన్‌వాడీ భవనం



అసంపూర్తిగా అంగన్‌వాడీ భవనం

దొరవారిసత్రం: మోదుగులపాళెం గ్రామంలోని అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవనం పశువుల కొట్టంగా మారింది. అంగన్‌వాడీ భవనం అసంపూర్తిగా ఉండిపోవడంతో స్థానికంగా ఉన్న అంగన్‌వాడీ పిల్లలు ప్రాథమిక పాఠశాలలోని ఓ గదిలో ఉంటున్నారు. పిల్లల సౌకర్యార్థం గత టీడీపీ పాలనలో సుమారు రూ.4 లక్షల వ్యయంతో అంగన్‌వాడీ భవనం మంజూరు చేశారు. పనులు దక్కించున్న అప్పటి కాంట్రాక్టర్ శ్లాబ్, పూత పనులు చేసి అర్ధంతరంగా నిలిపివేశాడు. దీంతో అప్పటి నుంచి నేటి వరకు అంగన్‌వాడీ భవనం అసంపూర్తిగానే ఉండిపోయింది. పనులు పూర్తి చేయించాల్సిన సంబంధిత అధికారులు కూడా పట్టించుకోకుండా వదిలేశారు. ఈ అంగన్‌వాడీ భవనం మాత్రం కొందరికి పశువుల కొట్టంగా మారింది.

పాఠశాలల విలీనంపై ఆందోళన



వెస్ట్ పాఠశాల ముందు ఆందోళన

కలువాయి: కూటమి ప్రభుత్వం చేపట్టిన పాఠశాలల విలీనంపై తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కలువాయి మండల కేంద్రం లోని వెస్ట్ , గిరిజన కాలనీ, బద్దెవోలు యూపీ పాఠశాలల విద్యార్థులు, తల్లిదండ్రులు, ఎస్ఎంసీ సభ్యులు గురువారం ఆందోళనకు దిగారు. ఈ పాఠశాలలో నాడు-నేడు కింద 19 లక్షలతో అన్ని వసతులు కల్పించి ఇప్పుడు ఇక్కడి 3, 4, 5 తరగతుల విద్యార్థులు 21 మందిని కలువాయి మోడరన్ ప్రాథమిక పాఠశాలకు తరలిస్తే ఈ పాఠశాలలో కేవలం 13 మంది మిగులుతారని తెలిపారు. కలువాయి గిరిజన కాలనీ వాసులు మోడల్ పాఠశాలకు తమ పిల్లలను పంపలేమని తెగేసి చెపుతున్నారు. వీరంతా మండల విద్యాధికారి కె.రేణుకకు వినతి పత్రాలు అందజేశారు. తాము ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని విద్యాధికారి రేణుక వివరించారు.

రెండు టిప్పర్లు స్వాధీనం

కోట: చిట్టేడు వద్ద రవాణా శాఖ అధికారి ప్రభాకర్ గురువారం తనిఖీలు నిర్వహించారు. ఓవర్ లోడుతో గ్రావెల్ తరలిస్తున్న రెండు టిప్పర్లను స్వాధీనం చేసుకున్నారు. అపరాధ రుసుం విధించి వాహనాలను కోట పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

పూరిల్లు దగ్ధం



మంటలను ఆర్పుతున్న ఫైర్‌సిబ్బంది

కోట: చిట్టేడు ఎస్టీ కాలనీలో కుడుముల అంకయ్యకు చెందిన పూరిల్లు గురువారం అగ్నికి ఆహుతైంది. ఇంట్లో వంట చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించి ఇల్లు కాలిపోయినట్లు బాధితుడు తెలిపాడు. ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఇంట్లో ఉన్న వస్తువులన్నీ కాలిపోయినట్లు బాధితుడు తహసీల్దార్ జయజయరావుకు ఫిర్యాదు చేశాడు. సాయం అందించాలని కోరాడు.

పోలేరమ్మ హుండీ ఆదాయం రూ.21 లక్షలు

వెంకటగిరి రూరల్: వెంకటగిరి శక్తి స్వరూపిణి శ్రీ పోలేరమ్మ తల్లి ఆలయం హుండీకి రూ.21,38,758లు రాబడి వచ్చినట్లు వెంకటగిరి గ్రూప్ దేవస్థానం ఈఓ ఎ.శ్రీనివాసులురెడ్డి గురువారం మీడియాకు తెలియజేశారు. గత ఏడాది సెప్టెంబర్ 27వ తేదీ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 6వ తేదీ వరకు హుండీలో భక్తులు సమర్పించిన కానుకలను పాతకోట శ్రీరామ మందిరంలో లెక్కించినట్లు తెలియజేశారు. ఇందులో రూ.21,38,758 నగదు, 11.100 మిల్లీ గ్రాములు బంగారం, 179 గ్రాములు వెండి, యూఎస్ డాలర్-1, ఇండోనేషియా రుఫామ్ -1, చైనీస్ యాన్ 6 సమర్పించినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, బ్యాంకు అధికారులు, దేవాదాయ శాఖ సిబ్బంది తదితరులు ఉన్నారు.

బెల్టు నిర్వహిస్తే చర్యలు



నిందితుడి అరెస్టు

వాకాడు: ఎక్కడైనా బెల్టు షాపులు నిర్వహిస్తూ పట్టుబడితే సంబంధిత వ్యక్తులపై చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ ఆర్‌యూవీఎస్ ప్రసాద్ హెచ్చరించారు. కోట మండలం కొత్తపట్నం గ్రామంలో బెల్టు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలసి ఆయన గురువారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో గ్రామానికి చెందిన భాస్కర్ అనే వ్యక్తి బెల్టు దుకాణం నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. అతని వద్ద తొమ్మిది మద్యం బాటిళ్లు ఉండడంతో అతనిని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు తెలిపారు. బెల్టు దుకాణాలు నిర్వహించడం గుర్తిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

వైఎస్సార్ సీపీ నేతకు ఎమ్మెల్సీ పరామర్శ



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

కోట: విద్యానగర్‌కు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కూచివాడ పరంధామరెడ్డిని గురువారం ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ పరామర్శించారు. పరంధామరెడ్డి తల్లి యశోదమ్మ ఇటీవల మృతి చెందారు. వారి నివాసానికి విచ్చేసిన ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ ఆమె చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. పార్టీ నాయకులు భక్తవత్సలరెడ్డి, సంపత్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, నాగూర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏజీపీ గ్యాస్ పైపులైన్‌పై తవ్వకాలు నిషిద్ధం

ఓజిలి: జాతీయ రహదారి కూడలి వద్దనున్న ఏజీపీ గ్యాస్ పరిశ్రమ నుంచి అత్తివరం, నాయుడుపేట, గూడూరు, మేనకూరు ఇండస్ట్రియల్ పరిసర ప్రాంతాల్లోని రోడ్డు పక్కనే గ్యాస్ పైపులైన్‌పై తవ్వకాలను నిషేధించినట్లు పరిశ్రమ యాజ మాన్యం గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. ప్రజలు అవగాహన లేకుండా గ్యాస్ పైపులైన్‌పై తవ్వకాలు చేపడుతుండడంతో గ్యాస్ లీకై ఆస్తితోపాటుగా ప్రాణనష్టం జరుగుతుందన్నారు. పైపులైన్‌పై జేసీబీ, ఇతర యంత్రాలతో తవ్వకాలు జరిపే ముందు పరిశ్రమ యాజమాన్యానికి సమాచారం ఇవ్వాలని హెచ్చరిస్తున్నప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. సమాచారం లేకుండా, జాగ్రత్తలు పాటించకుండా తవ్వకాలు జరిపితే చర్యలు తీసుకుంటామన్నారు. పైపులైన్‌లకు దగ్గరగా మరమ్మతులు చేసేవారు పరిశ్రమ టోల్‌ఫ్రీ నంబర్లు 1800 202 2999, 72000108123 సమాచారం అందించాలని కోరారు.

అభివృద్ధి పనులు అడ్డుకోవద్దు

చిల్లకూరు: క్రిస్ సిటీ కోసం చేపడుతున్న అభివృద్ధి పనులను తీరప్రాంత వాసులు అడ్డుకోవద్దని తహసీల్దార్ శ్రీనివాసులు కోరారు. మండల తీర ప్రాంతంలోని తమ్మినపట్నం రెవెన్యూ పరిధిలో క్రిస్ సిటీకి సేకరించిన భూములకు పరిహారం చెల్లించకుండా పనులు చేపట్టడంతో రైతులు బుధవారం అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ గురువారం అక్కడకు చేరుకుని రైతులతో మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాలు వచ్చిన వెంటనే పరిహారం అందిస్తామని, కాంట్రాక్టు సంస్థకు సహకరించాలని సూచించారు. దీంతో యథావిధిగా సంస్థ తమ పనులను కొనసాగించింది. తహసీల్దార్ వెంట వీఆర్‌ఓ బాలాజీ ఉన్నారు.

మధ్యాహ్న భోజనంలో కక్కుర్తి వద్దు



గురుకుల పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న విజయ్ ప్రతాప్‌రెడ్డి

సూళ్లూరుపేట: ప్రభుత్వ స్కూళ్లు, హాస్టళ్లు, గురుకుల పాఠశాలల్లో నిరుపేద విద్యార్థులు చదువుకుంటుంటారని, వారికి పెట్టే ఆహారం విషయంలో వార్డెన్లు కక్కుర్తి పడవద్దని ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్‌ప్రతాప్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన సూళ్లూరుపేట పట్టణంలోని సరసమ్మ కట్ట మీదున్న అంగన్‌వాడీ కేంద్రాన్ని, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు పెట్టే భోజనాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన భోజనం రుచి చూశారు. గురుకుల పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ మధ్యాహ్న భోజనాల విషయంలో సమస్యలున్నాయని, అవి మైనర్ సమస్యలేనని చెప్పారు. విద్యార్థులకు నాణ్యమైన తిండిని మెనూ ప్రకారం పెట్టాలని కోరారు. భోజనం విషయంలో సాక్ష్యాధారాలతో ఎవరైనా ఫిర్యాదులు ఇస్తే వెంటనే స్పందిస్తామని చెప్పారు. అందుకే 94905 51117 వాట్సాప్ నెంబర్‌కు ఫిర్యాదు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

ఉపాధి కల్పించాలని ఆందోళన



ఎస్‌ఐఓటీ గేట్ వద్ద నిరసన

వాకాడు: తీర ప్రాంతంలో ఏర్పాటవుతున్న ఎస్ఐఓటీ వద్ద స్థానికులు తమకు ఉపాధి కల్పించాలని గురువారం నిరసన వ్యక్తం చేశారు. గతంలో టీడీపీ ఉన్న సమయంలో ఎస్‌ఐఓటీని ఏర్పాటు చేసేందుకు వాకాడు మండలం తూపిలిపాళెం వద్ద భూములు సేకరించారు. ఆ సమయంలో స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అయితే నేటికీ ఆ ఊసే లేక పోవడంతో మత్స్యకారులతోపాటు స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దీంతో స్థానికులు స్ఐఓటీ గేట్ వద్ద ఆందోళనకు దిగి నిరసన వ్యక్తం చేశారు. ఎస్‌ఐఓటీని పర్యవేక్షించే అధికారి ఉద్యోగాలు అమ్ముకుంటున్నారని విమర్శించారు. ఉపాధి కల్పించకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి



సమీక్షిస్తున్న సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీన

వాకాడు: రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించి, అర్జీదారులకు సమాధానం చెప్పాలని గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీన సూచించారు. వాకాడు రెవెన్యూ కార్యాలయంలో గురువారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఇటీవల జరిగిన రెవెన్యూ సదస్సుల్లో అర్జీల పరిష్కారం వివరాలను తెలుసుకున్నారు. నోషనల్ ఖాతాలు, ఫ్రీహోల్డ్‌కు సంబంధించి ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయో సమీక్షించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామయ్య, డీటీ సందీప్, ఆర్‌ఐ అఖిల్, వీఆర్‌ఓలు, సర్వేయర్లు ఉన్నారు.

ఆశల మామిడి పూత



మామిడి చెట్టుకు మందుల పిచికారీ

సైదాపురం: మామిడి పంట ఈ ఏడాది కలసి వస్తోందని రైతులు ఆశిస్తున్నారు. చెట్టుకు బాగా పూత రావడమే దీనికి కారణం. తిరుపతి జిల్లా వెంకటగిరి నియోజకవర్గంలోని అంతర్భాగమైన సైదాపురం మండలంలో సుమారు 500 ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. ఈసారి విస్తారంగా పూత వచ్చింది. పూత పిందెగా మారి.. పంట చేతి వస్తే నాలుగు రూపాయాలు కళ్ల చూస్తామని రైతులు నమ్మకంగా ఉన్నారు. పూతను కాపాడుకోవడానికి సస్య రక్షణ చర్యల్లో నిమగ్నమయ్యారు. అయితే ప్రస్తుతం కురుస్తున్న పొగమంచు రైతులను కలవరానికి గురిచేస్తోంది. దట్టంగా కురుస్తున్న మంచుతో పూత రాలిపోయే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. ఉద్యానశాఖాధికారులు కూడా రైతులకు తగిన సూచనలు సలహాలను అందిస్తున్నారు.



విపరీతంగా పూసిన పూత

కండలేరులో 54.192 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 54.192 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 650, లోలెవల్ కాలువకు 70, హైలెవల్ కాలువకు 170, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.